క్లుప్తంగా

నేడు ఇఫ్తార్ విందు

తాండూరు రూరల్: ముస్లింలకు ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని సమాద్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించే విందుకు ముస్లింలు అందరూ హాజరుకావాలన్నారు.

యాలాలలో..

యాలాల: మండల కేంద్రంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున మండల స్థాయిలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా తెలిపారు. స్థానిక జామియా మసీదు ఆవరణలో సాయంత్రం 6 గంటలకు విందు ఉంటుందని చెప్పారు. కార్యక్రమానికి మండలంలోని మైనార్టీలు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పెద్దేముల్: బుద్వారం గ్రామంలో రెండు రోజుల క్రితం అంజిలమ్మకు చెందిన ఇంటికి అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఘటనా సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. నిత్యావసరా వస్తువులతో పాటు దుస్తులు, రూ.5వేల నగదు కూడా బూడిదవడంతో ఆ కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌తో పాటు పలువురు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

జోడో యాత్రలో ఆ పార్టీ నేతలు

దౌల్తాబాద్: రానున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు ఆశాభావం వ్యక్తంచేశారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం అల్లాపూర్‌లో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధే తప్పా.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని ఆరోపించారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన కాంగ్రెస్ పట్ల ప్రజలు ఇంకా అభిమానం చూపిస్తున్నారని వెల్లడించారు. పార్టీ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ, నిరుపేదలకు రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, బోయిని వెంకట్రాములు, వీరన్న, సత్యపాల్, వెంకట్రాములు, నర్సప్ప, కుర్మనిదస్తప్ప, శరణయ్య, నర్సింగ్‌భాన్‌సింగ్, మహిపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- అన్ని మతాలకు సమప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం
- ఎమ్మెల్యే కాలె యాదయ్య



కానుకలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట: రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని, తెలంగాణలో ప్రధాన పండుగలైన దసరా, క్రిస్మస్, రంజాన్‌లకు ప్రభుత్వం కానుకలు ఇవ్వడం దేశంలో ఎక్కడా లేదని తెలిపారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్ అన్ని వర్గాలను సమాన దృష్టితో చూస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎక్‌మామిడి సర్పంచ్ ఎండీ రఫీ, నాయకులు నాగిరెడ్డి, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో కుల్కచర్ల నేతలు



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులతో ప్రహ్లాదరావు

కుల్కచర్ల: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కుల్కచర్లకు చెందిన నేతలు పాల్గొన్నారు. మంగళవారం మండలానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు స్థానిక నేతలతో కలిసి అక్కడ ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన వెంట పార్టీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు అంజిలయ్య, నర్సింహులు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు

తాగునీటి కష్టాలు గట్టెక్కించాలని, నీటికోసం మహిళలు రోడ్డెక్కే దుస్థితి రాకుండా చూడాలని ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిషన్ భగీరథ పథకం నీరుగారిపోతోంది!. ఇంటింటికీ నల్లా ఇచ్చి భగీరథ జలాలు సరఫరా చేయించాలనే సంకల్పం సడలింది. ఊరూవాడకు పైప్‌లైన్లు వేయించినా.. కొందరు అధికారుల నిర్లక్ష్యంతో కనెక్షన్లు ఇవ్వకపోవడంతో నీటికోసం పలు గ్రామాల ప్రజలు కోటి పాట్లు పడుతున్నారు.

పూర్తికాని మిషన్ భగీరథ పనులు

- పైపులైన్లు ఉన్నా.. కనెక్షన్లు నున్నా..
- పట్టించుకోని అధికారులు



పట్టణంలో వృథాగా ఉన్న భగీరథ కనెక్షన్



రాపోల్‌లో కనెక్షన్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పరిగి: పట్టణంలోని బీసీ కాలనీతో పాటు రాపోల్, తొండుపల్లి, చిట్యాల తదితర గ్రామాల్లో భగీరథ నీరు సక్రమంగా సరఫరా లేక స్థానికులు నీటికోసం అల్లాడిపోతున్నారు. ఇంటింటికీ తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టినా.. పథకం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారిక లెక్కల్లో పనులు పూర్తి చేసినట్లు ఉండి.. ప్రజలకు నీరందించక పోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులపై బాధిత గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం నిత్యం ఇబ్బంది పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

సమస్య పట్టని అధికారులు

బీసీ కాలనీలో గతంలో ఇక్కడ నీటి సమస్య తలెత్తగా.. కాలనీ వాసులు ధర్నా చేశారు. దీంతో ప్రజాప్రతినిధులు బోరును తవ్వించారు. నాటి నుంచి ఆ బోరునే వినియోగిస్తున్నారు. ఆ తరువాత భగీరథ నీటి కోసం ఇంటింటికీ పైపులైన్లు ఇచ్చి.. నెల రోజుల పాటు నీటి సరఫరా చేసి ఆపేశారు. ఆపేసి రెండేళ్ల గడిచినా.. సరఫరా పునరుద్ధరించక పోవడంతో స్థానికులు సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించారు. అయినా స్పందించడం లేదని, ఒకే బోరుతో నీటిని అందించడంతో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. రాపోల్, తొండుపలి, చిట్యాలలో సగం కనెక్షన్లు ఇచ్చి నీటి సరఫరా చేస్తున్నారు. మిగతా ఇళ్ల సంగతి మరవడంతో బాధితులు అధికారులకు విన్నవించగా.. వారం రోజుల్లో పనులు పూర్తి చేయిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ జలాలు అందించాలని కోరుతున్నారు.

మధ్యలో వదిలేశారు..



గ్రామాల్లో భగీరథ నీరందకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. కనెక్షన్లు ఇవ్వాలని అధికారులను కోరితే ఇష్టానికి మాట్లాడుతున్నారు. ప్రజలు నీటి కోసం అల్లాడుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. గ్రామంలో మిషన్ భగీరథ పనులు మధ్యలో వదిలి వేయడంతో నీటి కష్టాలు తప్పడం లేదు.

– నాగవర్ధన్, రాపోల్ గ్రామం

త్వరలో పనులు పూర్తి చేయిస్తాం



రాపోల్, తొండుపల్లి, చిట్యాల గ్రామాల్లో మిషన్ భగీరథ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని త్వరలో పూర్తి చేయిస్తాం. గతంలో టెండర్లు వేసినా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనుల్లో ఆలస్యం అయింది. ఇద్దరు కాంట్రాక్టర్లను మార్చాం. మూడో కాంట్రాక్టర్ వారం రోజుల్లో వచ్చి పనులు ప్రారంభిస్తారు.

– సుబ్రహ్మణ్యం, మిషన్ భగీరథ డీఈ పరిగి

అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త

- అప్రమత్తంగా ఉండి.. తగిన చర్యలు తీసుకోవాలి
- గ్యాస్ వినియోగంలో నిర్లక్ష్యం తగదు
- అగ్ని మాపక వారోత్సవాల్లో అధికారులు



కొడంగల్: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మోమిన్‌పేట: అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఆందోళనకు గురికావొద్దని అగ్ని మాపక కేంద్రం ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం కార్తికేయ ఇండస్ట్రీస్‌లో ఫైర్ యాక్సిడెంట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఆందోళన చెందితే.. ఆలోచనలు రావని, ప్రమాదం జరిగిన వెంటనే దగ్గర్లో ఉన్న ఇసుక లేదా మట్టిని మంటలపై చల్లాలని సూచించారు. తడి గుడ్డను కూడా విసరాలన్నారు. ఆ వెంటనే 101నంబరుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అగ్ని మాపక వాహనం వచ్చే వరకు వేచి చూడకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కర్మాగార ఉద్యోగులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: గ్యాస్ సిలిండర్ల వినియోగంలో నిర్లక్ష్యం తగదని అగ్నిమాపక సిబ్బంది అన్నారు. బొంరాస్‌పేట మండల కేంద్రంలోని గురు రాఘవేంద్ర ఇండేన్ గ్యాస్ గోదాంలో సిబ్బందికి, వినియోగదారులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జి ఫైర్ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది మతీన్, శ్రీనివాస్, శ్యామప్ప, బొరానొద్దీన్, శాంతీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: కార్తికేయ ఇండస్ట్రీస్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గొర్రెల యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం



గొర్రెల కాపరుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న పశు వైద్యాధికారి గీత

- తొలి విడతలో గొర్రెలు రానివారు అర్జీ పెట్టుకోవాలి
- పశు వైద్యాధికారి గీత

మోమిన్‌పేట: రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా ప్రభుత్వం గొర్రెల కాపరుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుందని పశు వైద్యాధికారి గీత చెప్పారు. మండల కేంద్రం పశు వైద్యశాలలో లబ్ధిదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడతలో 44మందికి పలు కారణాల వల్ల యూనిట్లు అందలేదని, వారు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండో విడతలో 575మందిని అర్హులుగా గుర్తించామని, కుల ధృవీకరణ, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్సులతో పాటు ఒక పాసుపోర్టు సైజు ఫొటోతో అప్లికేషన్ పెట్టుకోవాలని ఆమె తెలిపారు. ఒక యూనిట్‌లో ఒక్క పొట్టేలుతో పాటు 20గొర్రెలు ఉంటాయని, యూనిట్ మొత్తం రూ.1.75 లక్షలు కాగా.. లబ్ధిదారుని వాటా 25శాతం రూ.43,750లు. ప్రభుత్వం వాట75శాతం రూ.1,31,250లు అవుతుందని వివరించారు. లబ్ధిదారుని వాటా డబ్బులు తన బ్యాంకు ఖాతా నుంచి మాత్రమే స్వీకరించబడతాయని గీత పేర్కొన్నారు. రెండు రోజులుగా కేవలం 17 దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ వైద్యాధికారి మధన్‌మోహన్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మట్టితో గుంతల పూడ్చివేత

యాలాల: మండల పరిధిలోని అగ్గనూరు శివారు నుంచి ఉన్న ప్రధాన రోడ్డుపై పడిన గుంతల్లో మొరం పోసి చదును చేస్తున్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ భీమప్ప, బీఆర్ఎస్ యువ నాయకుడు శ్రీశైలం ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి ఎన్కేపల్లి శివారు వరకు రోడ్డుపై ఉన్న గుంతల్లో మట్టి పోస్తుండడంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

‘కంటివెలుగు’ దేశానికే ఆదర్శం

- శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. రంగాపూర్‌లో మంగళవారం రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటివెలుగు దేశానికే ఆదర్శమని, మొదటి విడతలో ఎంతో మంది కంటికి వెలుగులు వచ్చాయన్నారు. నాడు వైద్యం చేయించుకోని వారు.. ఇప్పుడు చేయించుకోవాలని, ఎలాంటి కంటి జబ్బులు ఉన్నా పరిష్కరించబడతాయని తెలిపారు. గతంలో ఎంతో మంది నిరుపేదలు కంటి చూపు మందగించి చూపించుకునే వారు కాదని, ఈ కంటి వెలుగులో పరీక్షతో పాటు మందులు, కళ్లద్దాలు, శస్త్ర చికిత్స కూడా ఉచితమేనని వెల్లడించారు. కావున ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకొని.. కంటి పాపను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోవిందపూర్, పాల్కంపల్లి గ్రామాల్లో పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి జిల్లాలోనే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కావున గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, రైతుబంధు కోఆర్డినేటర్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాలకు ఆహ్వానం

కుల్కచర్ల: ఈనెల 23వ తేదీన సాల్వీడు గ్రామంలో జరిగే బీరప్పస్వామి ఉత్సవాలకు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డిని కురుమ సంఘం నేతలు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే పండుగను ప్రస్తుతం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఉత్సవాలకు వస్తానని హామీ ఇచ్చినట్లు కుర్మలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, గడుసు వెంకటయ్య, రంగి శ్రీనివాస్, బాలేష్, నర్సింహులు, చీపిరి వెంకటయ్య, జోగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నిరుపేద ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తాము అండగా నిలుస్తామని ఎమ్మెల్యే కొప్పుల అన్నారు. అంతారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నారాయణ భార్య కిష్టమ్మ మృతిచెందగా.. బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

ఆర్థికసాయం

దోమ: పేద కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అన్నారు. బొంపల్లి గ్రామానికి చెందిన దొరవోని రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందగా.. జెడ్పీటీసీ నాగిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే.. రాములమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

మెట్ల బావికి మరమ్మతు



చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

కొడంగల్: పట్టణ శివారులోని గాడిబాయి దేవాలయం దగ్గర ఉన్న పురాతన మెట్ల బావికి మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కార్మికులు మంగళవారం బావి వద్ద చెత్తను తొలగించారు. మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ మధుయాదవ్‌లు దగ్గరుండి పనులు చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ అంతర్జాతీయ పురాతన కట్టడాల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఈ బావికి మరమ్మతు చేయించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు పరిశీలించి, బావి చరిత్రను ప్రజలకు వివరించాలని కోరారు. బావిలో ఉన్న నీటిని తొలగించి పూడిక తీస్తే లోపల ఉన్న బావులు బయట పడతాయన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



పెద్దేముల్: రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి

పెద్దేముల్: రంజాన్ కిట్లను మంగళవారం తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజీరెడ్డిలు పలు గ్రామాల మత పెద్దలకు అందజేశారు. మండలంలోని 37 జీపీలకు 250 కిట్లు ప్రభుత్వం సరఫరా చేసిందని, ఆయ గ్రామాల్లో సర్పంచ్, మజీద్ సదర్‌తో పాటు గ్రామ పెద్దల సమక్షంలో అందచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ ఏటా రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు కిట్లను పంపిణీ చేస్తుందన్నారు. జమాల్ తదితరులు పాల్గొన్నారు.

అవసరమున్న వారికే కానుకలు

ధారూరు: ప్రభుత్వం సరఫరా చేస్తున్న రంజాన్ కానుకలు అర్హులు, అవసరమున్న వారి పేర్లనే సూచించాలని తహసీల్దార్ భవనేశ్వర్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక జెడ్పీటీసీ సుజాత, సర్పంచ్ చంద్రమౌళితో కలిసి రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రంజాన్ కానుకగా సీఎం కేసీఆర్ ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జామ మసీదు సదర్ ఉమర్, బీఆర్ఎస్ నాయకులు రాజునాయక్, అంజయ్య, రహమతుల్లాఖాన్, వేణుగోపాల్‌రెడ్డి, ఇస్మాయిల్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ధారూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సర్కిల్ సీఐ అప్పయ్య అన్నారు. మంగళవారం ఆయన ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బందితో కలిసి ధారూరు సర్కిల్ పరిధి కోట్‌పల్లి ప్రాంతంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడాల్సిందేనని, లేదంటే తగిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

జీఓ 58,59ను వినియోగించుకోండి

దోమ: జీఓ 58,59 నంబర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షాహెదా బేగం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు గడువును పెంచిందని, జీఓ ప్రకారం గ్రామాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఇంటి యాజమాన్య హక్కు పత్రాన్ని పొందేందుకు అర్జీ పెట్టుకోవాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందని, అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. అర్జీ చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించి ఇంటి యాజమాన్య హక్కు పత్రాన్ని అందజేస్తామని వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

బొంరాస్‌పేట: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిందని మాజీ వైస్ఎంపీపీ, ఎంపీటీసీ శేరి నారాయణరెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన కావలి వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్నాడు. అనంతరం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. రూ.49,600 మంజూరు అయ్యాయి. ఆ చెక్కును సోమవారం శేరినారాయణరెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, తుల్జారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీఓ సత్తయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్లను చెక్ చేయడంతో పాటు కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసి, పూర్తి కూలి పొందాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో సోదరభావం



ధారూరు: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు



తాండూరు: ఎంపీ, ఎమ్మెల్సీకి ఫలాలు తినిపిస్తున్న ముస్లింలు

ధారూరు: రంజాన్ మాసంలో ముస్లింలకు ప్రభుత్వపరంగా ఇచ్చే ఇఫ్తార్ విందు సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. మత సామరస్యానికి ఈ ఇఫ్తార్ విందు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భువనేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో..

తాండూరు: తాండూరు పట్టణంలోని రాయల్ మెజిస్టిక్ గార్డెన్‌లో మంగళవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. విందులో ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమల్‌అతార్, బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, నాయకులు మసూద్, నయీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఆధ్వర్యంలో..

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో మంగళవారం మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్ నాయక్, కోఆప్షన్ సభ్యుడు జాఫర్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు అన్సారీ, ఎస్సీసెల్ అధ్యక్షుడు రాజు, బీసీసెల్ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎంఈఓ

పూడూరు: ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించడం అభినందనీయమని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సైబేజ్ సాఫ్ట్‌వేర్ స్వచ్ఛంద సంస్థ సొంత ఖర్చులతో నిర్మించిన అదనపు తరగతి గదిని ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ బడులకు చేయూతనందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సైబేజ్ సంస్థ డైరెక్టర్ రీతునతని, సర్పంచ్ సంధ్య, ఎంపీటీసీ సిరిదేవిక, సైబేజ్ కోఆర్డినేటర్ సురేష్, పాఠశాల హెచ్ఎం అంజిలయ్య, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.